# గుట్టలో వైభవంగా నిత్యారాధనలు

యాదగిరిగుట్ట, జూలై 19 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో స్వయంభువులకు నిత్యారాధనలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామిని మేల్కొల్పి తిరువారాధన, ఉదయం ఆరగింపు చేపట్టారు. అనంతరం స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామి, అమ్మవార్ల నిత్య తిరు కల్యాణోత్సవం ఘనంగా జరిపించారు. గంటన్నర పాటు అర్చక బృందం శాస్త్రోక్తంగా కల్యాణ తంతు జరిపించారు. ప్రధానాలయ వెలుపల ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హోమం చేశారు. స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజ వాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. సాయంత్రం వేళలో స్వామివారికి తిరువీధి, దర్బార్ సేవ ఘనంగా నిర్వహించారు. రాత్రి ప్రధానాలయ ముఖ మండపంలో ప్రతిష్ఠామూర్తులకు తిరువారాధన, సహస్రనామార్చనలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. అన్ని విభాగాలు కలుపుకొని స్వామి వారి ఖజానాకు రూ.10,19,524 ఆదాయం సమకూరింది.

### లక్ష్మీనర్సింహుడిని దర్శించుకున్న అదనపు కలెక్టర్

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని కొత్తగా వచ్చిన అదనపు కలెక్టర్ ఎం.భాస్కర్‌రావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ఆలయ సంప్రదాయ స్వాగతం పలికారు. దర్శనం అనంతరం అర్చకులు వేదాశీర్వచనం చేయగా ఆలయ పర్యవేక్షకుడు రాంమోహన్ ప్రసాదం అందించారు.


లక్ష్మీనర్సింహుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

### విమాన గోపురం బంగారు తాపడానికి రూ.5లక్షల విరాళం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ దివ్య విమాన గోపురం స్వర్ణ తాపడానికి రూ.5లక్షల విరాళం సమకూరింది. భూదాన్ పోచంపల్లి మండలంలోని జులూరు గ్రామానికి చెందిన వన్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ బొమ్మిరెడ్డి రవీందర్‌రెడ్డి బుధవారం కుటుంబసమేతంగా స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆలయ ముఖ మండపంలో రూ.5లక్షల నగదును ఆలయాధికారి సురేందర్‌రెడ్డికి అందించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు పెలిమెల్లి శ్రీధర్ గౌడ్, రైతు బంధు సమితి కన్వీనర్ పేరబోయిన సత్యనారాయణ ఉన్నారు.

# వర్షాతిరేకం

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ముసురు
- పత్తితో పాటు మెట్ట పంటలకు ఉపయుక్తం
- ఊపందుకోనున్న వరినాట్లు


భువనగిరి : వడపర్తి గ్రామంలో ముసురులోనే వరి నాట్లు వేస్తున్న మహిళలు

నల్లగొండ ప్రతినిధి, జూలై 19 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బుధవారం సైతం వాతావరణం పూర్తిగా చల్లబడి ఉంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షంతో పాటు జిల్లా అంతటా ముసురుకుంది. అయితే ఈ సీజన్‌లో ఇప్పటివరకు భారీ వర్షాలు మాత్రం లేవు. నల్లగొండ జిల్లాలో 12.3మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. మునుగోడులో అత్యధికంగా 28.6మిల్లీ మీటర్లు, పెద్దవూరలో అత్యల్పంగా 5.4మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో చిట్యాలలో 24.4, వేములపల్లిలో 20.8, చండూరులో 19.7, నకిరేకల్‌లో 16.6, కట్టంగూరులో 16.5, శాలిగౌరారంలో 15.7, నల్లగొండలో 15, మర్రిగూడలో 14.5, మాడ్గులపల్లిలో 13.9, తిప్పర్తిలో 13.8, గుర్రంపోడులో 13.2, చింతపల్లిలో 13.1, మిర్యాలగూడ, దామరచర్ల, నాంపల్లిలో 12.3చొప్పున, డిండిలో 11.8, చందంపేటలో 9.8, కనగల్‌లో 8.6, కేతేపల్లిలో 8.3, త్రిపురారంలో 8, గట్టుప్పల్, నిడమనూరు, అడవిదేవులపల్లిలో 7.8చొప్పున, పీఏపల్లిలో 7.7, అనుముల, తిరుమలగిరి సాగర్‌లో 7.2చొప్పున, దేవరకొండలో 6.3, కొండమల్లేపల్లి, నేరడుగొమ్ములో 5.5మిల్లీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

ఈ సీజన్‌లో జూన్ 1నుంచి ఈ నెల 19వరకు 158.7మిల్లీ మీటర్ల సాధారణ వర్షపాతం కురవాల్సి ఉండగా 137.1మిల్లీ మీటర్ల మాత్రమే కురిసింది. 14శాతం లోటు వర్షపాతం నమోదైంది. యాదాద్రిభువనగిరి జిల్లాలోని ఆత్మకూరు(ఎం) మండలంలో అత్యధికంగా 31.8మిల్లీ మీటర్లు, అత్యల్పంగా చౌటుప్పల్‌లో 5.8మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. సూర్యాపేట జిల్లాలో అత్యధికంగా నూతనకల్, తిరుమలగిరి మండలాల్లో అత్యధికంగా 16మిల్లీ మీటర్లు, తుంగతుర్తిలో అత్యల్పంగా 13మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

### సాగుకు ఉపయోగకరం

వాస్తవంగా సీజన్ ఆరంభం నుంచి సమృద్ధిగా వర్షాలు కురిస్తే ఈ పాటికి మెట్ట పంటల సాగు పూర్తయ్యేది. చేలు కూడా ఏపుగా పెరిగేవి. కానీ జూన్ నెలాఖరు వరకు వర్షాలు లేక పంటల సాగు ఆలస్యమైంది. జూలైలో అప్పుడప్పుడు కురిసిన వర్షాలకు పంటల సాగు ఊపందుకుంది. వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం ఇప్పటివరకు నల్లగొండ జిల్లాలో మొత్తం 6,02,133 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. అందులో అత్యధికంగా పత్తి పంట సాగైంది. జిల్లాలో మొత్తం 6.50లక్షల ఎకరాల సాధారణ విస్తీర్ణానికి గాను ఇప్పటివరకు 5,38,922 ఎకరాల్లో సాగైంది. 10వేల ఎకరాల్లో కంది పంట సాగు అంచనాకు గాను కేవలం 942ఎకరాల్లోనే సాగైంది. ఇతర అన్ని రకాల పంటలు కలిపి మరో 10,749 ఎకరాల్లో సాగయ్యాయి. అంచనాల ప్రకారం మరో లక్ష ఎకరాలకు పైగా మెట్ట పంటలు సాగు కావాల్సి ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పత్తి పంట ఏపుగా పెరగడానికి తోడ్పడనుంది. అదేవిధంగా అడుగు మందులు పెట్టడానికి అనువుగా మారింది. మరోవైపు వరి సాగు ఇప్పటివరకు 51,525 ఎకరాల్లోనే సాగైంది. ఈ సీజన్‌లో మొత్తం 5.25లక్షల ఎకరాల్లో అవుతుందని అంచనా వేశారు. ఇందులో సాగర్ ఆయకట్టుదే మెజార్టీ వాటా. ఇదిగాక ప్రస్తుతం బోర్లు, బావుల కింద వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎడమ కాల్వకు నీటి విడుదల మొదలైతేనే ఆయకట్టులో వరి నార్లు పోసుకోవడంతో పాటు ఇప్పటికే బోర్ల కింద పోసుకున్న వారి వరినాట్లు మొదలుకానున్నాయి. గతేడాది జూలై 28వ తేదీన సాగర్ ఆయకట్టుకు సాగునీరు విడుదల చేశారు. ఎగువ కృష్ణాలో కురిసిన వర్షాలతో అప్పటికే సాగర్‌కు శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో మొదలైంది. దీంతో నీటి విడుదలకు మార్గం సుగుమమైంది. కానీ ఈ సీజన్‌లో ఇంకా అలాంటి ఆనవాళ్లు కనిపించడం లేదు.

### మూసీకి 614 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి బుధవారం 614.25క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా 329.49క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కొనసాగుతున్నది. కుడి, ఎడమ కాల్వలకు కలిపి 187.23క్యూసెక్కులు వెళ్తుండగా 59.80క్యూసెక్కుల నీరు ఆవిరవుతుంది. సీఫేజ్, లీకేజీ, మోటార్ల ద్వారా 82.46 క్యూసెక్కులు వెళ్తుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645(4.46 టీఎంసీలు)అడుగులు కాగా ప్రస్తుతం 642.05(టీఎంసీలు) అడుగులుగా ఉన్నట్లు ఏఈ ఉదయ్‌కుమార్ తెలిపారు.


భువనగిరి జిల్లాకేంద్రంలో కురుస్తున్న వర్షం


నల్లగొండ జిల్లాకేంద్రంలో మొక్కజొన్న కంకుల విక్రయం

### శాలిగౌరారం ప్రాజెక్టులోకి భారీగా నీరు

శాలిగౌరారం : చిన్న నీటి పారుదల తరహా ప్రాజెక్టుల్లో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు భారీగా వచ్చి చేరుతోంది. ఇప్పటికే ప్రాజెక్టులోకి భారీగా నీరు చేరి కుడి, ఎడమ కాల్వల ద్వారా వానకాలం సాగుకు నీరు అందించాల్సి ఉండగా వర్షాభావ పరిస్థితులతో ప్రాజెక్టులోకి అనుకున్నంతగా నీరు చేరలేదు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 21అడుగులు ఉండగా ప్రస్తుతం 7అడగుల మేర నీరు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండితే ఆయకుట్టు కింద 6వేల ఎకరాల భూములు సాగులోకి రానున్నాయి. ప్రాజెక్టులోకి నీరు చేరుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.


శాలిగౌరారం ప్రాజెక్టులోకి వస్తున్న నీరు


వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలకు గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

# సీఎం కేసీఆర్ సారథ్యంలోనే రాష్ట్రాభివృద్ధి

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య
- ఇస్మాయిల్‌పల్లి గ్రామస్తులు బీఆర్‌ఎస్‌లో చేరిక

కట్టంగూర్, జూలై 19 : సీఎం కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతున్నదని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని ఇస్మాయిల్‌పల్లి గ్రామ వివిధ పార్టీలకు చెందిన యన్నమల్ల నర్సింహ, కంచోజు భాస్కర్, పెంజర్ల జగదీశ్, నాగరాజు, శ్రీను, లచ్చయ్యతో పాటు 80మంది నాయకులు, కార్యకర్తలు నార్కట్‌పల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. అడుగడుగున అభివృద్ధిని అడ్డుకుంటున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు తెలంగాణలో మనుగడ లేదన్నారు. ప్రతి కార్యకర్త నిబద్ధతతో పని చేసి నియోజవర్గ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో పులిగిల్ల వెంకన్న, రేకల భిక్షం, మేడబోయిన ఆంజనేయులు, శేఖర్‌రెడ్డి, పులిగిల్ల సైదులు, నాగరాజు, రవి, జహంగీర్, ఉప్పలపల్లి శంకర్, శ్రవణ్ పాల్గొన్నారు.


గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

# రాష్ట్ర సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్
- బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

అడ్డగూడూరు, జూలై 19 : రాష్ట్ర ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మండలంలోని జానకిపురం గ్రామానికి చెందిన 10మంది బీజేపీ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి తిరుమలగిరి మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో బుధవారం చేరారు. అనంతరం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా పాలన అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ దర్శనాల అంజయ్య, రైతు బంధు మండల కోఆర్డినేటర్ తీపిరెడ్డి మేఘారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, సర్పంచ్ కొప్పుల మోహన్‌రెడ్డి, పాలబిందెల వెంకన్న పాల్గొన్నారు.